## 18వ పాఠం

# దైవేతరుల పేర జంతు బలి

పరమ ప్రభువు అల్లాహ్ ఇలా ఆదేశించాడు:

**(ఓ ప్రవక్తా!) ఈ విధంగా ప్రకటించు: "నిస్సందేహంగా నా నమాజ్, నా ఖుర్బానీ, నా జీవనం, నా మరణం – ఇవన్నీ సర్వ లోకాల ప్రభువైన అల్లాహ్ కొరకే. ఆయనకు భాగస్వాములెవరూ లేరు. దీని గురించే నాకు ఆజ్ఞాపించబడింది. ఆజ్ఞాపాలన చేసే వారిలో నేను మొదటివాడను.** ***(ఖుర్ఆన్ 6 : 162, 163)***

మరో చోట ఇలా చెప్పబడింది:

**"నువ్వు నీ ప్రభువు కోసమే నమాజు చెయ్యి. ఖుర్బానీ ఇవ్వు."**

***(ఖుర్ఆన్ 108 : 2)***

మహనీయ ముహమ్మద్ (సఅసం) తనకు నాలుగు (అల్లాహ్) తీర్పులు వినిపించారని అలీ బిన్ అబూ తాలిబ్ (రజి) చెప్పారు:

1) **"లఅనల్లాహు మన్ జబహ లిగైరిల్లాహ్"** (అల్లాహ్ తప్ప ఇతరుల పేరు మీద జంతుబలి ఇచ్చేవారిపై అల్లాహ్ శాపం పడుతుంది).

   **గమనిక:** రబీవుల్ అవ్వల్ మాసంలో 11వ తేదిన షేఖ్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ (రహ్మాలై) పేరు మీద, ఆయన సామీప్యం కోసం మేకలను జిబహ్ చేయటాన్ని ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు.

2) తమ తల్లిదండ్రులను శపించేవారు స్వయంగా అల్లాహ్ శాపానికి గురవుతారు.

3) ధర్మంలో లేని విషయాలను కల్పించేవారికి (బిద్అతీలకు) ఆశ్రయమిచ్చిన వారిపై అల్లాహ్ శాపం పడుతుంది.

https://teluguislam.net

4) భూమి సరిహద్దులను తారుమారు చేసేవారిపై అల్లాహ్ శాపం పడుతుంది. (సహీహ్ ముస్లిం)

దైవప్రవక్త (సఅసం) చెప్పారని తారిఖ్ బిన్ షిహాబ్ (రజి) తెలియజేశారు. "ఒక వ్యక్తి ఈగ మూలంగా స్వర్గంలో ప్రవేశించాడు. మరొక వ్యక్తి ఈగ మూలంగానే నరకానికి వెళ్ళాడు." 'అదెట్లా ఓ దైవప్రవక్తా!' అని సహచరులు సందేహపడగా, ఆయన (స) ఇలా సమాధానమిచ్చారు: "ఇద్దరు వ్యక్తులు ఒక ప్రదేశం మీదుగా ప్రయాణం సాగించారు. అక్కడి ప్రజలు తమ విగ్రహానికి ఏదో ఒక వస్తువును సమర్పించుకునే వరకూ ఆ మార్గం గుండా ఎవరినీ వెళ్ళనిచ్చేవారు కాదు. వారు ఆ ప్రయాణీకులలో ఒకరిని నైవేద్యం కొరకు పురికొల్పారు. 'అర్పించుకోవటానికి నా దగ్గర ఏమీలేద'ని ఆ వ్యక్తి అన్నాడు. 'ఏదో ఒకటి అర్పించుకో. ఆఖరికి ఒక ఈగ అయినా సరే' అని స్థానికులు కోరారు. అతను ఒక ఈగను ఆ విగ్రహానికి సమర్పించుకున్నాడు. దాంతో వారు ఆ వ్యక్తిని విడిచిపెట్టారు. ఆ విధంగా ఆ వ్యక్తి ఈగ మూలంగా నరకానికి పోయాడు. 'నువ్వు కూడా ఏదో ఒకటి సమర్పించుకో' అని వారు రెండవ వ్యక్తిని కూడా పురమాయించారు. 'నేను ఒక్కడైన అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ, ఏదీ సమర్పించనుగాక సమర్పించను' అని అతను తెగేసి చెప్పాడు. అందువల్ల వారు అతని మెడనరికి చంపేశారు. తత్ఫలితంగా ఆ వ్యక్తి స్వర్గంలో ప్రవేశించాడు." (ముస్నదె అహ్మద్)

## ఈ పాఠంలోని ప్రధానాంశాలు

- అల్లాహ్ తప్ప వేరితరుల పేర జంతుబలి (ఖుర్బానీ) సమర్పించుకునే వారు ధూత్కరించబడ్డారు.
- తమ తల్లిదండ్రులను దూషించేవాడు కూడా శాపగ్రస్తుడే. సాధార

https://teluguislam.net

ణంగా ఎవరూ తమ కన్నవారిని దూషించరు. అయితే వారు వేరొకరి తల్లిదండ్రులను దూషిస్తారు. కారణంగా వారు వీరి తల్లిదండ్రులను తిడతారు. ఆ తిట్లకూ బాధ్యులు వీరే కదా!

- ధర్మంలో లేని పోని కొత్త పనులకు, కొత్త పోకడలకు (బిద్అత్‌లకు) పాల్పడేవారికి సహాయపడటం, సమర్థించటం, ఆశ్రయమివ్వటం ఘోరమైన తప్పిదం. ఇలాంటి తప్పులకు ఊతమిచ్చేవారు కూడా నిందార్హులే.
- స్వార్థబుద్ధితో, పొరుగువాని భూమిని కబ్జా చేసుకునే ఉద్దేశంతో భూమి సరిహద్దురాళ్ళను మార్చివేయటం ఘోరపాతకం. ఈ ఘోరానికి ఒడిగట్టేవారు కూడా ధూర్తులే.
- ఈగ ఉపమానంతో వివరించబడిన కథ క్లుప్తమైనదే అయినా గుణపాఠంతో కూడుకున్నది.
- ఈగను విగ్రహానికి అర్పించిన వ్యక్తి వాస్తవానికి షిర్క్ చేసే ఉద్దేశ్యంతో ఆ పని చేయలేదు. తన స్వార్థం కోసం అలా చేశాడు. అయినప్పటికీ అది అతని పాలిట ప్రాణాంతకంగా పరిణమించింది.
- సిసలైన విశ్వాసులు షిర్క్ (బహుదైవోపాసన)ను అసహ్యించుకుంటారు. విపత్కర పరిస్థితుల్లో కూడా వారు అధర్మంతో రాజీపడరు.
- ఈగను విగ్రహానికి నజరానాగా సమర్పించి నరకానికి వెళ్ళిన వ్యక్తి ఎవరో కాదు, ముస్లిమే. అతను ముస్లిం అయి ఉండని పక్షంలో "కేవలం ఒక ఈగ మూలంగా అతను నరకానికి పోయాడని"ని దైవప్రవక్త(స) చెప్పి ఉండేవారే కాదు. వ్యక్తిలో విశ్వాసం లోపిస్తే అది అతన్ని నరకానికి గొనిపోతుంది.
- "స్వర్గం మీ పాదుక త్రాడు కన్నా అతి సమీపంలో ఉంది. నరకం

కూడా అంతే దగ్గర్లో ఉంది" అన్న దైవప్రవక్త (స) ప్రవచనానికి దీని ద్వారా సమర్థన లభిస్తోంది.

## మోడల్ ప్రశ్నలు

1) దైవేతరుల పేర జంతుబలి ఇవ్వడంపై ఖుర్‌ఆన్‌లో ఏమనబడింది?
2) ఈగ మూలంగా స్వర్గ, నరకాలకు వెళ్ళిన సంఘటనను వివరించండి?

## అవును / కాదు

1) నిస్సందేహంగా నమాజ్, ఖుర్బానీ, జీవనం, మరణం ఇవన్నీ అల్లాహ్ కొరకే ( )
2) అల్లాహ్ తప్ప ఇతరుల పేరు మీద జంతు బలి ఇవ్వడం సరైనదే ( )
3) తల్లిదండ్రులను శపించేవాడు అల్లాహ్ శాపానికి గురవుతాడు. ( )
4) పొరుగువారి భూమిని కబ్జా చెయ్యడం ఘోర పాతకం ( )
5) వ్యక్తిలో విశ్వాసం లోపిస్తే అది అతన్ని నరకానికి గొనిపోతుంది. ( )

https://teluguislam.net